క్లుప్తంగా

యువకుడికి గాయాలు


గాయపడిన రాజశేఖర్‌రెడ్డి

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో విద్యుత్ స్తంభం పైనుంచి పడి రాజశేఖర్‌రెడ్డి అనే యువకుడు గాయపడ్డాడు. కాంట్రాక్టు వర్కరుగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డి విద్యుత్ సరఫరా నిలిపివేసి స్తంభంపై పనిచేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. కిందకుపడి స్పృహ కోల్పోవడంతో గ్రామస్తులు వెంటనే వైద్య పరీక్షల కొరకు గుంతకల్లు వైద్యశాలకు తరలించారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామాల్లో వెలసిన మారెమ్మ, రేణుకా ఎల్లమ్మ అమ్మవార్లకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బోనాల సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వర్షాలకు దెబ్బతింటున్న పంటలు

కృష్ణగిరి: నైరుతి రుతుపవనాల ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటల దెబ్బతినే అవకాశం ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మే మొదటి వారంలో సాగు చేసిన వేరుశనగ, పత్తి పంటలు వర్షాలకు ఏపుగా వస్తున్నా... తడి ఎక్కువగా ఉండడంతో రంగు మారుతుంది. దీంతో ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు ఈ వర్షాలతో నష్టపోయే ప్రమాదం ఎక్కువగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ పంటకు బెట్ట వస్తేనే పూత వస్తాదని, కానీ ఈయేడాది వర్షాలు అధికంగా వస్తుండటంతో పంట ఏపుగా వస్తుంది కానీ అనుకున్నంత దిగుబడి రావడం కష్టమని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మలేరియా కేసు నమోదు

దేవనకొండ: మండలంలోని నెల్లిబండ గ్రామంలో మలేరియా కేసును గుర్తించినట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని రంగస్వామి అనే వ్యక్తికి మలేరియాతో బాధపడుతున్నట్లు గుర్తించి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. బాధితుడి ఇంటి పరిసరాలను మంగళవారం పరిశీలించి డీడీటీ మందును పిచికారీ చేయించారు. వర్షాలు కురుస్తున్నందువల్ల సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బంది చేత స్ప్రే చేయిస్తామన్నారు. అనంతరం మలేరియా, చికున్ గున్యా, బోధకాలు, మొదడువాపు వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్‌వైజర్ రంగస్వామి, ఆశా, సీహెచ్‌లు పాల్గొన్నారు.

బెల్డోణ సొసైటీ అధ్యక్షుడి రాజీనామా


సెక్రటరీ హరికృష్ణకు రాజీనామ పత్రాన్ని అందిస్తున్న మల్లికార్జున

చిప్పగిరి: బెల్డోణ సొసైటీ అధ్యక్షుడు మల్లికార్జున మంగళవారం తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని సొసైటీ సెక్రటరీ హరికృష్ణకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సొసైటీలో తనతో పాటు మెంబర్లుగా ఉన్న రంగస్వామి, రామాంజినప్ప, మొత్తం కమిటీ సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు తెలిపారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ఆలూరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రిజర్వాయర్లలో నీరు చేరుతోందని కొళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటిని ప్రజలు కాచి చల్లార్చుకుని తాగాలని ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య సూచించారు. స్థానిక డీఈ కార్యాలయంలో ఆయన మంగళవారం వివిధ గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే వాటర్‌మెన్లతో సమావేశమయ్యారు. డీఈ మాట్లాడుతూ.. గ్రామాలకు నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్‌లకు లీకేజీ ఏర్పడకుండా చూడాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, శుద్ధి చేసిన నీటినే కుళాయిలకు సరఫరా చేయాలని ఆదేశించారు.

నేడు ఉపాధి సిబ్బందితో సమావేశం

ఆలూరు: స్థానిక సీఎల్‌ఆర్సీ కార్యాలయంలో బుధవారం వివిధ మండలాలకు చెందిన ఏపీఓ, టీసీ, ఈసీ, ఎఫ్‌ఏలతో ఏపీడీ పద్మావతి సమావేశం నిర్వహిస్తారని ఏపీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఏపీఓ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఉపాధి పథకంలో భాగంగా మొక్కల పెంపకంపై ఏపీడీ చర్చిస్తారన్నారు. ప్రతి గ్రామానికి 200 మొక్కలను కేటాయించేలా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సమావేశానికి ఉపాధి హామీ పథకం సిబ్బంది హాజరుకావాలని ఏపీఓ శ్రీనివాసులు కోరారు.

మలేరియా నిర్మూలనకు కృషి

- ఘనంగా మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు
- దోమకాటు ప్రమాదకరం
- ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి
- జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్


దేవనకొండలో వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్

దేవనకొండ: దోమకాటు ప్రమాదకరమని, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే మీటింగ్‌ను వైద్యాధికారి విజయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్, పీఈహెచ్‌సీ వైద్యాధికారులు విజయభాస్కర్, కళ్యాణ్ పాల్గొన్నారు. ఆశావర్కర్లకు, ఏఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు నిర్దేశించిన టార్గెట్‌లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దోమకాటు వల్ల వచ్చే జబ్బులు మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లల్లో ప్రజలు ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచుకోకుండా చూడాలన్నారు. గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చే ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. తగిన మెలుకువలు, సలహాలు తెలియజేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వైద్యసిబ్బందితో కలిసి మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

ఆలూరు రూరల్: మలేరియా వ్యాధి నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మొలగవల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాఘురామి రెడ్డి సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షకాలం ప్రారంభం కావడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, డెంగీ తదితర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రిళ్లు దోమ తెరలు వాడాలన్నారు. మూడు రోజుల పాటు దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో జ్వరం వస్తే వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. ర్యాలీలో వైద్యులు రేష్మా, ఎంపీహెచ్‌ఈఓ ఆండ్రూస్, సూపర్‌వైజర్ మహబూబ్ బాషా, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర: మలేరియా వ్యాధిపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్యపరచాలని వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి, యునాని వైద్యుడు జిలాని సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రం మద్దికెరలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో సిబ్బందికి వ్యాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో వైద్య సిబ్బందితో పాటు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి డీడీటీ మందులు పిచికారీ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాష, ల్యాబ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ప్రకాష్, ఏఎన్‌ఎంలు లక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.


మొలగవెల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ రఘురామి రెడ్డి


మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దరఖాస్తు చేసుకోండి

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి గ్రామం వద్ద ఉన్న మోడల్ స్కూల్లో 2024–24 సంవత్సరానికి 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షామీల తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ 7వ తరగతిలో ఏడు సీట్లు ఖాళీ ఉండగా రిజర్వేషన్ పరంగా ఈడబ్ల్యూఎస్ బాలికలకు– 3 సీట్లు, ఎస్సీ జనరల్–1, ఎస్టీ బాలికలకు –1, బీసీ– ఈ బాలికలకు –1, పీహెచ్ బాలికలకు –1, అలాగే 8వ తరగతిలో 6 సీట్లు ఖాళీ ఉండగా రిజర్వేషన్ పరంగా ఓసీ జనరల్–1, బీసీ–డి జనరల్ –1, బీసీ–ఈ జనరల్ –1, ఎస్సీ బాలికలకు –1, ఎస్టీ జనరల్ –1, పీహెచ్ జనరల్ –1 ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 18వ తేదీన మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి రిజర్వేషన్ పరంగా సీట్లు భర్తీ చేస్తామని చెప్పారు. అలాగే 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఎంపికైన వారు 15వ తేదీలోగా చేరాలని సూచించారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మించండి


పేట బసవేశ్వరస్వామి ఆలయ వీధిలో గుంతల్లో నిలిచిన నీరు

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలోని పేట బసవేశ్వరస్వామి ఆలయ ప్రధాన వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మించి దోమలు, సీజనల్ వ్యాధులు దరి చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆ పరిసర వాసులు కోరుతున్నారు. సదరు రోడ్డులో భారీ గుంతలు పడి మురుగు, వర్షపు నీరు ముందుకెళ్లకుండా అధ్వానంగా మారడంతో పాటు పారిశుద్ధ్యం పడకేసి దుర్వాసన వెదజల్లుతుందని వాపోయారు. దీని కారణంగ దోమల బెడదతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నట్లు వారు చెప్పారు. సమస్యను అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి


ఆస్పరిలో డాక్టర్ దుర్గాబాయికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఆస్పరి: వర్షాకాలం మొదలైనందున గ్రామాలో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సీపీఐ నాయకులు విరుపాక్షి, క్రిష్ణమూర్తి, రంగన్న, రామాంజిని, రంగప్ప, తిక్కయ్య, రంగస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దుర్గాబాయికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున గ్రామాల్లోని వీధుల్లో నీటి నిల్వ ఏర్పడి దోమలు అధికమవుతున్నాయన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు విజృంభించే ప్రమాదం ఉన్నందున్న వైద్యాధికారులు గ్రామాల్లోని ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించి అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

దోమలను నియంత్రిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు


తుగ్గలిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

తుగ్గలి: ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలు అని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తుగ్గలి పీహెచ్‌సీ వద్ద చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, దోమలు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలను నియంత్రిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అనంతరం పీహెచ్‌సీలో నిర్వహించి ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం అయ్యేలా చూడాలన్నారు.


సైబర్ నేరగాళ్ల వల!

- బ్యాంకుల ప్రతినిధుల పేరిట వాట్సాప్ మెసేజ్‌లు
- డబ్బు గెలుచుకున్నారని ఫోన్ చేసి ఆశ చూపుతున్న కేటుగాళ్లు
- యువకులకు న్యూడ్ వీడియో కాల్స్



పత్తికొండ రూరల్ : నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరికి సెల్‌ఫోన్ తప్పనిసరి అయ్యింది. ఇంకోవిధంగా చెప్పాలంటే జీవితంలో భాగమైంది. ఈ అవకాశాన్ని సైబర్ నేరగాళ్లు వాడుకుంటున్నారు. గత కొన్నిరోజుల నుంచి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ ఏదో ఒక రూపేణా డబ్బు ఆశ చూపించి ప్రజలకు ఆశల వల విసురుతున్నారు. సైబర్ కేటుగాళ్ల మాయమాటలకు అమాయకులే కాదు... మేధావులు సైతం మోసపోతూనే ఉన్నారు. 'మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.9,980లు రివార్డు గెలుచుకున్నారు. ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి... వెంటనే మీకు అకౌంటుకు రివార్డు సొమ్ము జమ చేయబడుతుందని ఒక మెసేజ్'.. ఇలా పలు వాట్సాప్ గ్రూపుల్లో సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల అకౌంటు నుంచి సొమ్మును కాజేసేందుకు వల విసురుతున్నారు. మరికొందరికి ఏకంగా ఫోన్ చేసి ఆధార్‌కార్డు నెంబరు, డెబిట్‌కార్డు వివరాలు, పిన్ నెంబరు లాంటి వివరాలు అడుతూ మాయమాటలు చెప్పి ఖాతాలు ఖాళీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏ మెసేజ్ వెనుక ఎలాంటి మోసం దాగుందో తెలియక సెల్‌ఫోన్ వినియోగదారులు పరేషాన్ అవుతున్నారు. గత నెలలో కూడా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మండలంలోని కొందరు అమాయక యువకుల అకౌంటులో సొమ్ము రూ. లక్షల్లో మాయమైంది. కొందరు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయిస్తుండగా మరికొందరు తాము మోసపోయిన ఈవిషయం బయటకు తెలిస్తే నలుగురిలో నవ్వులపాలవుతామని గమ్మున ఉంటున్నారు. కొందరు యువతులు యువకులకు న్యూడ్‌వీడియో కాల్స్ చేసి వలపు వల విసురుతున్నారు. మాయమాటలతో మభ్యపెడుతున్నారు. ఆ తర్వాత వారితో మాట్లాడిన శృంగార సంభాషణ, వీడియో ద్వారా చిత్రీకరించి వారికే వాట్సాప్ ద్వారా పంపించి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారు. ఈవీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి మిమ్మల్ని బజారుకి లాగుతామని బెదిరించి డబ్బు లాగుతున్నారు. ఇలా సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకూ శృతిమించిపోతున్నాయి. సైబర్ నేరగాళ్ల నియంత్రణకు పోలీసు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్బు ఎవరికీ ఊరికే రావు



ముఖ్యంగా డబ్బులెవరికీ ఊరికే రావు అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే అంతే సంగతులు. ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. వాట్సాప్ ద్వారా వచ్చిన వివిధ బ్యాంకుల పేరుతో తప్పుడు సందేశాలను నమ్మవద్దు. ఏబ్యాంకు నుంచి ఎవరూ ఫోన్ చేసి ఏటీఎం కార్డు పిన్ నెంబరు చెప్పమని అడగరు. ఫేక్ యాప్‌లను ఎవరూ డౌన్‌లోడు చేసుకోవద్దు. ఈవిషయాన్ని అందరూ గమనించాలి. డబ్బు ఆశ చూపించే వారి మాయమాటలు నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– మురళీమోహన్, సీఐ, పత్తికొండ

చెట్టు తొలగింపు


ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించడంతో వాహనాల రాకపోకలు సాగుతున్న దృశ్యం

పత్తికొండ రూరల్: పత్తికొండలోని పోస్టాఫీసు వద్ద ప్రమాదకర స్థితిలో ఉన్న చెట్టును మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. వరుసగా కురుస్తున్న వర్షానికి పోస్టాఫీసు ప్రహరీ కూలిపోయి చెట్టు రక్షణ కోల్పోయి పడిపోయేలా ఒరిగింది. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యుత్ శాఖ అధికారులు చెట్టును తొలగించారు.

గంగమ్మవ్వకు బోనాల సమర్పణ


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న రజకులు

గూడూరు రూరల్: పట్టణంలో మంగళవారం గంగమ్మవ్వ ఉత్సవాలను రజకులు ఘనంగా నిర్వహించారు. గూడూరు నగర కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ బోనాలను ఊరేగింపుగా కుమ్మరి కుంట వద్ద వెలసిన గంగమ్మ గుడికి తీసుకెళ్లారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, శేషన్న, సురేష్, అశోక్, రమేష్, రాజు, దోన్ చిన్న, లింగన్న, ఎర్రన్న, నాగరాజు, రామదాసు, శ్యామన్న, మాధమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఆశా డే

ఆదోని టౌన్: పట్టణంలోని షరాఫ్‌బజార్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు బాబురాజు, లలితమ్మ, మేరీ, జ్ఞానేశ్వరి మాట్లాడారు. ఆశావర్కర్ల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా


కామినహాల్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి భరోసా ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కామినహాల్ గ్రామంలో జరిగిన సుంకులమ్మ, దేవమ్మవ్వల దేవర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన గ్రామంలోని కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడొద్దని, గొడవలకు వెళ్లవద్దని సూచించారు. ధర్మబద్ధంగానే ఉండి అధికార పార్టీ శ్రేణుల అరాచకాలను అడ్డుకుందామని చెప్పారు. కార్యకర్తలు, నాయకులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌నాయుడు, మండల కో–కన్వీనర్ మల్లికార్జున, మండల యూత్ నాయకులు గంగాధర, శ్రీరాములు, కట్టుబడి ఎర్రిస్వామి, లోకనాథ్, తిప్పారెడ్డి, చెన్నూరప్ప, గోపాల్, గూళ్యం లింగప్ప, శేఖన్న, గోవర్ధన్, లక్ష్మినారాయణ, నాగరాజు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకులు నరసయ్య, సత్యన్న, రమేష్ నాయుడు, సుధాకర్‌బాబు, భీమరాజు తెలిపారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పురపాకల ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది పదో తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈనెల 16వ తేదీన ఆదోని పట్టణంలోని శిల్పా సౌభాగ్య నగర్‌లోని జీఎస్‌ఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శ్రీ వాల్మీకి మహర్షి ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 14వ తేదీలోగా తమ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం వివరాలతో 94918 69398, 96407 18346 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మాజీ సర్పంచ్ మృతి

గోనెగండ్ల: మేజర్ గ్రామ పంచాయతీ గోనెగండ్ల మాజీ సర్పంచ్ టి.ఈశ్వరమ్మ (70) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఈమె భర్త తలారి వాసుదేవనాయుడు 1995లో గోనెగండ్ల సర్పంచ్‌గా గెలుపొందారు. 2000 సంవత్సరంలో గోనెగండ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా టి.ఈశ్వరమ్మ గెలుపొంది ఐదేళ్ల గ్రామానికి ఎన్నో సేవలు అందించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి కృషి చేశారు. గోనెగండ్లకు ఆమె చేసిన సేవలు మరవలేనివని గ్రామస్తులు కొనియాడారు. ఆమె పార్థివదేహాన్ని గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు.

వణికిస్తున్న వీధి కుక్కలు


హొళగుంద బస్టాండులో తిరుగుతున్న కుక్కల మంద


వీధి కుక్క దాడిలో గాయపడిన దృశ్యం (ఫైల్)

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలో వీధి కుక్కల బెడద విపరీతంగా మారింది. ఇటీవల కాలంలో గ్రామంలో కుక్కల దాడులు పెరిగిపోతుండడంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. చాలా మంది కుక్కకాటుకు గురై తీవ్రంగా గాయపడ్డారు. ఈ నెలలో హొళగుందతో పాటు పల్లెల నుంచి 28 మంది కుక్కకాటు, ఇద్దరు పిల్లి, ఇద్దరు కోతి దాడిలో గాయాలకు గురై హొళగుంద పీహెచ్‌సీలో చికిత్స తీసుకున్నట్లు వైద్యాధికారి న్యూటన్ తెలిపారు. వీధుల్లో, బస్టాండులో తిరుగుతున్న కుక్కలు ఉన్నట్టుండి పెద్దలతో పాటు చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. ఫలితంగా ప్రతి నెలా సగటున మండలంలో 4 నుంచి 6 వరకు కుక్కకాటు కేసులు నమోదవుతుండగా ఇటీవల కాలంలో ఆ సంఖ్య విపరీతంగా పెరిగింది. హొళగుందలో ప్రస్తుతం ఉన్న కుక్కలతోనే ప్రజలు ఇబ్బందులు పడుతుండగా ఇతర ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కుక్కలను పట్టుకొచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు అంటున్నారు. దీని కారణంగా హొళగుందలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. అంతేగాక వింత వ్యాధులతో కుక్కలు వీధుల్లో తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు.

కనబడని కుక్కల నియంత్రణ చర్యలు

వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలతో పాటు సంతానోత్పత్తి నివారణకు ఆపరేషన్ చేయాలి. పంచాయతీ అధికారులు వీటిపై దృష్టి సారించాల్సి ఉంది. కొన్నాళ్లుగా ఈ చర్యలను అధికారులు చేపట్టడం లేదు. పశువులు, గొర్రెలు, ప్రజలపై కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.